నీటికుంట తీర్చేను చింత

- వేసవిలో జీవాలకు తీరుతున్న నీటికష్టాలు
- ఉపాధిహామీ పథకంలో నిర్మాణం
- రైతులు ముందుకు రావాలంటున్న అధికారులు



ఈ చిత్రంలో కనిపిస్తున్న నీటికుంట లక్ష్మణ చాంద మండలంలోని పొట్టపెల్లి (కే) గ్రామంలోనిది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ముంపు ప్రాంతమైన ఈ గ్రామంలో చెరువుగాని, కుంట గాని లేదు. ఏటా వేసవిలో మేతకు వెళ్లిన పశువులు దాహం తీర్చుకునేందుకు అల్లాడుతుండేవి. గతేడాది ఉపాధిహామీ పథకంలో భాగంగా గ్రామంలో నీటి కుంటను నిర్మించేందుకు రూ.తొమ్మిది లక్షలు మంజూరు చేశారు. ప్రస్తుతం పనులు చివరి దశకు చేరగా గేదెలు, మేకలు, గొర్రెలు కుంట వద్దకు వెళ్లి దాహం తీర్చుకుంటున్నాయి.



తిర్పెల్లిలో దాహం తీర్చుకుంటున్న పశువులు

లక్ష్మణచాంద: మేతకు వెళ్లిన పశువులతోపాటు అడవి జంతువులు దాహార్తి తీర్చేందుకు జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద గ్రామాల శివారులో నీటికుంటల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. గతంలో నిర్మించిన పశువుల నీటి తొట్టిలు నిరుపయోగంగా మారడంతో ప్రస్తుతం గ్రామాల్లో నీటికుంటల నిర్మాణం చేపడుతున్నారు. ఈ కుంటల నిర్మాణంతో అడవి జంతువులతోపాటు పశువులకు మేలు జరుగుతుందని రైతులు పేర్కొంటున్నారు.

గతేడాది మూడు కుంటల నిర్మాణం..

లక్ష్మణచాంద మండలంలో 18 పంచాయతీల పరిధిలో 23 గ్రామాలున్నాయి. గత మూడేళ్లలో ఉపాధిహామీ పథకంలో భాగంగా మండలంలోని ఆయా గ్రామాల్లో 54కుంటలను నిర్మించినట్లు అధికారులు పేర్కొన్నారు. మండలంలో 9,420 గేదెలు, 4,300 ఆవులు, 26,700 గొర్రెలు, ఆరు వేల మేకలు కలిపి మొత్తం 46,420 ఉన్నాయి. ఇప్పటివరకు గత మూడేళ్లలో 54 నీటికుంటలు నిర్మించారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో పొట్టపల్లి(కె) గ్రామంలో నిర్మిస్తున్న నీటికుంటకు రూ.9,31,785 మంజూరవగా, తీర్పెల్లిలో నిర్మించిన రెండు నీటికుంటల్లో పూడికతీత పనులకు రూ.నాలుగు లక్షల చొప్పున కేటాయించినట్లు ఉపాధిహామీ అధికారులు పేర్కొన్నారు. పొట్టపెల్లిలో నీటికుంట పనులు చివరిదశకు చేరగా.. తిర్పెల్లిలో పూడికతీ పనులు కొనసాగుతున్నాయని అధికారులు వివరించారు.

పశువుల దాహం తీరుతుంది



గతంలో వేసవిలో తాగేందుకు నీరు దొరకకపోవడంతో పశువులు అల్లాడుతుండేవి. ప్రస్తుతం నీటికుంట నిర్మించడంతో గ్రామ పశువులకు ఇబ్బంది తొలగిపోతుంది.

–నాగేష్, పొట్టపెల్లి(కే)

సంతోషంగా ఉంది



గ్రామాల్లో పశువుల దాహం తీర్చేందుకు నీటికుంటలు నిర్మించడం సంతోషంగా ఉంది. ఉపాధిహామీ అధికారులు క్షేత్రస్థాయికి నీటికుంటలతో కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించాలి.

– శివన్న, న్యూకంజర్

రైతులు ముందుకొస్తే నిర్మిస్తాం



పశువుల దాహం తీర్చేందుకు, భూగర్భజలాలు పెంచేందుకు నీటికుంటలు నిర్మిస్తున్నాం. ఈ సంవత్సరం ప్రభుత్వ భూములు లేని గ్రామాల్లో రైతులు ముందుకొచ్చి భూములిస్తే నీటి కుంటలు నిర్మిస్తాం.

– ప్రమీల, ఈజీఎస్ ఏపీవో

అటెన్షన్ ప్లీజ్.. మురికి కాలువలు నిర్మించండి



తానూరు: మండలంలోని హిప్నెల్లితండాలో డ్రెయినేజీలు లేకపోవడంతో మురికినీరంతా రోడ్డుపై పారుతోంది. ఇంటి ముందు మురుగు నిలుస్తుండటంతో దోమలు వ్యాప్తి చెంది.. రోగాల బారిన పడుతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగు కాల్వలను నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: మోహన్‌సింగ్, ఎంపీవో, ఫోన్: 98666 51826

తెలంగాణ అభివృద్ధికి అడ్డుపడుతున్న సీఎం

- బీజేపీ రాష్ట్ర నాయకుడు రావుల రాంనాథ్



మాట్లాడుతున్న రావుల రాంనాథ్

సారంగపూర్(నిర్మల్): కేంద్రం నిధులతో తెలంగాణలో చేపడుతున్న అభివృద్ధి పనులకు సీఎం కేసీఆర్ అడ్డుపడుతున్నారని బీజేపీ రాష్ట్ర నాయకుడు రావుల రాంనాథ్ అన్నారు. మండలంలోని ఆలూరు, చించోలి(బి) గ్రామాల్లో ఆదివారం బూత్ కమిటీలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రధాని వివరిస్తే దాన్ని చూసి ఓర్వలేక రాష్ట్ర మంత్రుల ద్వారా విమర్శల దాడులు చేయించి తెలంగాణ ప్రజలను పక్కదోవ పట్టిస్తున్నారన్నారు. ఇటీవల బీఆర్ఎస్ నిర్వహించిన సభకు ఒక్క సింగరేణి కార్మికుడు కూడా హాజరుకాలేదన్నారు. రాష్ట్ర అభివృద్ధికి ఆటంకం కలిగిస్తున్నది ఎవరో ప్రజలు గమనిస్తున్నారన్నారు. సమావేశంలో రాష్ట్ర స్టడీ సర్కిల్ కన్వీనర్ వెంకటేశ్, పార్టీ మండల అధ్యక్షుడు విలాస్, కార్యదర్శి చైతన్య, సోషల్ మీడియా కన్వీనర్ తిరుమలచారి, నాయకులు శ్యాంసుందర్, అంబాజీ, రాజు, రాజేశ్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ పథకాలను వివరించాలి

దస్తురాబాద్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ఆ పార్టీ నాయకులు వివరించారు. ఆదివారం మండలంలోని గోడిసీర్యాల గ్రామంలో ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి దోనకంటి స్వామి ఆధ్వర్యంలో పల్లెపల్లెకు–ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ మండలాధ్యక్షుడు లక్ష్మణ్, ఓబీసీ మండలాధ్యక్షుడు హనుమాగౌడ్, మల్లేశ్, రాజేశం, రాజు, వెంకటరమణ, తిరుపతి, రాజేందర్, మునిందర్ పాల్గొన్నారు.

దేశానికే ఆదర్శంగా సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి
- భైంసాలో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం



ఎమ్మెల్యేకు చిత్రపటం అందిస్తున్న నేతలు

భైంసా: తెలంగాణలోని సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని బీఆర్ఎస్ నిర్మల్ జిల్లా అధ్యక్షులు, ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. ఆదివారం భైంసాలోని గౌరీశంకర్ ఫంక్షన్‌హాల్‌లో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ తెలంగాణ సంపద పెంచి రాష్ట్రంలోని నిరుపేదలకు సంక్షేమ పథకాల రూపంలో పంచుతున్నారని అన్నారు. మహారాష్ట్రలో పింఛన్ రూ.600 ఇస్తే.. మన వద్ద రూ.2016 అందిస్తున్నారన్నారు. నియోజకవర్గంలో కొత్త ఇళ్లు సైతం మంజూరవుతాయన్నారు. కార్యకర్తలు ఇంటింటికీ బీఆర్ఎస్ సంక్షేమ పథకాలను వివరించి..తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టాలన్నారు.

గుండెగాం వాసులతో చర్చ..

భైంసా మండలంలోని 30 గ్రామపంచాయతీల్లో జరిగిన అభివృద్ధిని వివరించిన ఎమ్మెల్యే ఆత్మీయ సమ్మేళనంలో గుండెగాం గ్రామస్తులతో పలు అంశాలు చర్చించారు. మరో నెల రోజుల్లో పూర్తిస్థాయి పరిష్కారం దొరుకుతుందని హామీ ఇచ్చారు. పునరావాసం కోసం కావాల్సిన నిబంధనల మేర పనుల్లో జాప్యం జరుగుతున్నమాట వాస్తవేమనని.. ఎట్టి పరిస్థితుల్లోనైనా సమస్య తీరుస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కార్యకర్తల అభిప్రాయాలను తెలుసుకున్నారు. భైంసా మండలవ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులు సమ్మేళనానికి తరలివచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, ఎంపీపీ కల్పన జాదవ్, మాజీ జెడ్పీటీసీ సూర్యకాంత్ రెడ్డి, మండల కన్వీనర్ భూమారెడ్డి, సీనియర్ నాయకులు సోలంకి భీంరావు, పీఏసీఎస్ చైర్మన్ దేవందర్ రెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు సంజీవ్‌రెడ్డి, గజానంద్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన వీఓఏలు

భైంసాటౌన్: తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని ముధోల్ నియోజకవర్గంలోని ఐకేపీ వీఓఏల సంఘం నాయకులు ఎమ్మెల్యే విఠల్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు ఆదివారం భైంసాలో ఆర్అండ్‌బీ విశ్రాంతిభవనం వద్ద ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈనెల 17 నుంచి పూర్తిస్థాయి సమ్మెలో పాల్గొంటామన్నారు. సంఘం అధ్యక్షులు భోజన్న, కార్యదర్శి రాజు, కోశాధికారి సంపత్, సభ్యులు ఉన్నారు.

దిష్టిబొమ్మ దహనాన్ని అడ్డుకున్న పోలీసులు



ఆందోళన చేస్తున్న నాయకులు

ఖానాపూర్: రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరితో 30 లక్షల నిరుద్యోగులకు అన్యాయం జరుగుతుందని.. వైఎస్సార్ తెలంగాణ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం ఖానాపూర్ తెలంగాణ చౌరస్తాలో నిర్వహించతలపెట్టిన సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహన కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం ఆ పార్టీ నాయకులను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ లోకిని రాము మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వ వైఫల్యంతో నష్టపోయిన నిరుద్యోగులకు న్యాయం జరిగే వరకు తమ పార్టీ పోరాడుతుందన్నారు. అరెస్టయిన వారిలో పార్టీ యూత్ జిల్లా అధ్యక్షులు శ్రీపాద శేషాద్రి, మండల అధ్యక్షులు బలగం రవీందర్, పట్టణ అధ్యక్షులు పానగంటి నరేశ్, యూత్ మండల అధ్యక్షులు ఎగుర్ల మహేశ్, మైనార్టీ విభాగం మండల అధ్యక్షుడు రైస్‌బేగ్, పట్టణ అధ్యక్షుడు ఇమ్రాన్ ఉన్నారు.

ఎల్‌ఓసీ అందజేత

కుంటాల: మండలంలోని సూర్యాపూర్ గ్రామానికి చెందిన బక్కియోగేశ్ అనారోగ్యానికి గురవగా రూ.రెండు లక్షల ఎల్‌వోసీ మంజూరైంది. ఆదివారం ఎమ్మెల్యే తన నివాసంలో ఎల్‌ఓసీని ఎమ్మెల్యే బాధితుడికి అందించారు. బీఆర్ఎస్ నాయకులు బక్కి భోజన్న, దొంతుల శివాజీ తదితరులున్నారు.

గ్రామాల్లో ఈస్టర్ పండుగ



లోకేశ్వరం: రాయపూర్‌కాండ్లీలో..



ఖానాపూర్‌లోని సీఎస్ఐ చర్చిలో ప్రార్థనలు



మాదాపూర్‌లో దైవ సందేశం ఇస్తున్న పాస్టర్

లోకేశ్వరం: మండలంలోని రాయపూర్‌కాండ్లీ, పిప్రి గ్రామాల్లో ఆదివారం ఈస్టర్ పండుగ జరుపుకున్నారు. ఉదయం నుంచి చర్చిలో పాస్టర్ కార్తీక్ ఆధ్వర్యంలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పాస్టర్ మాట్లాడుతూ ఏసు చూపిన బాటలో నడువాలన్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. సంఘం సభ్యులు పోశెట్టి, రత్నయ్య, కమిటీ సభ్యులు కమలాకర్, భాస్కర్, రవి, ప్రేమనందం, జయ్‌కుమార్ ఉన్నారు.

కడెం: మండలంలోని పెద్దూర్ చర్చిలో ఆదివారం ఈస్టర్ డే వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రీస్తు సందేశం మేరకు ప్రజలంతా శాంతి, సహనంతో కలిసిమెలిసి జీవించాలని ఫాదర్ పేర్కొన్నారు.

ఖానాపూర్: పట్టణంలోని సీఎస్ఐ చర్చితోపాటు మండలంలోని పలు గ్రామాల్లో చర్చిల్లో ఆదివారం ఈస్టర్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. సిలువ వేయబడిన ఏసుక్రీస్తు మూడో రోజును ఈస్టర్‌డేగా జరుపుకుంటారు. ఈ సందర్భంగా చర్చిల్లో క్రైస్తవులతో పాస్టర్లు ప్రార్థనలు చేయించారు. సీఎస్ఐ చర్చిలో ప్రభాకర్ ఆధ్వర్యంలో ప్రార్థనలు జరిగాయి.


లక్ష్మణచాంద: పురాతనమైన సోన్ మండలంలోని మాదాపూర్ బేతేలు చర్చిలో ఈస్టర్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పాస్టర్ సాలోమాన్ రాజు దైవ సందేశం వినిపించారు.



భైంసాటౌన్: పట్టణంలోని మున్సిపల్ డంపింగ్‌యార్డులో చెత్త నిర్వహణ సక్రమంగా జరగడం లేదు. ఇళ్లు, వ్యాపార సముదాయాల నుంచి సేకరిస్తున్న చెత్తను ఆటోల్లో డంపింగ్‌యార్డుకు తరలిస్తున్నారు. ఇక్కడ డీఆర్‌సీసీ, సెగ్రిగేషన్ షెడ్లు పనులు పూర్తి కాకపోవడంతో చెత్తకు నిప్పు పెడుతున్నారు. దీంతో పొగ కాలుష్యం ఏర్పడి రాకపోకలు సాగించే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

శిథిలావస్థకు సర్కారు బడులు

- ఆరుబయట చదువులు
- ఇబ్బంది పడుతున్న విద్యార్థులు
- సౌకర్యాలు కల్పిస్తే పెరగనున్న సంఖ్య



పెచ్చులు ఊడుతున్న భాగాపూర్ భవనం



శిథిలావస్థకు చేరిన లోకేశ్వరం ప్రాథమిక పాఠశాల భవనం

లోకేశ్వరం: ప్రైవేటుకు దీటుగా సర్కారు బడులను అభివృద్ధి చేస్తున్నాం.. నాణ్యమైన విద్యతోపాటు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని చెబుతున్న నాయకుల మాటలు క్షేత్రస్థాయిలో మాత్రం నీటి మూటలుగానే మిగులుతున్నాయి. లోకేశ్వరం మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారాయి. ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. శిథిల భవనాలను తొలగించి కొత్తవి నిర్మించాలని అధికారులను కోరుతున్నా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

మండలంలో..

లోకేశ్వరం మండలంలో 32 ప్రాథమిక పాఠశాలలు, 5 ప్రాథమికోన్నత, 8 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. నాలుగు ఉర్దూ ప్రాథమిక పాఠశాలలు, ఓ ప్రాథమికోన్నత పాఠశాలలు వీటికి అదనం.

ఏళ్ల తరబడి నిరుపయోగం ..

లోకేశ్వరం, భాగాపూర్ గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలలు ఏళ్ల తరబడి నిరుపయోగంగా ఉండడంతో శిథిలావస్థకు చేరాయి. ముందు జాగ్రత్తగా తరగతులు నిర్వహించకుండా ఉపాధ్యాయులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. లోకేశ్వరం ప్రాథమిక పాఠశాలలో 74 మంది విద్యార్థులు, ముగ్గురు ఉపాధ్యాయులు ఉన్నారు. ఐదు తరగతులకు గాను మూడు గదులున్నాయి. భాగాపూర్ ప్రాథమిక పాఠశాలలో 13 మంది విద్యార్థులు, ఉపాధ్యాయుడు తరగతి గది ఉంది. తరగతి గదుల పక్కనే ప్రమాదం పొంచి ఉంది. వచ్చేది వర్షాకాలం కావడంతో ఎప్పుడు కూలిపోతాయో చెప్పలేని పరిస్థితి. దీంతో ఆరుబయట తరగతులు నిర్వహిస్తున్నారు.

సౌకర్యాలు కల్పిస్తే పెరగనున్న విద్యార్థుల సంఖ్య..

మన ఊరు–మన బడిలో భాగంగా పాఠశాలలకు నిధులు మంజూరు చేసి కొత్త భవనాలను నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. కనీస సౌకర్యాలు కల్పిస్తే సర్కారు బడులకు వచ్చే వారి సంఖ్య పెరుగుతుంది.

నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తాం

లోకేశ్వరం, భాగాపూర్ ప్రాథమిక పాఠశాలల భవనాలు శిథిలావస్థకు చేరిన మాట వాస్తవమే. మన ఊరు–మన బడిలో నిధులు మంజూరవగానే కొత్త భవనాలను నిర్మిస్తాం. విద్యార్థుల సంఖ్య తక్కువ ఉన్న పాఠశాలల్లో పెరిగేలా చూస్తాం.

– చంద్రకాంత్, ఎంఈవో, లోకేశ్వరం

నీటి సమస్య పరిష్కరించిన కౌన్సిలర్



బోరు వద్ద సురేశ్, కాలనీవాసులు

ఖానాపూర్: పట్టణంలోని ఐదో వార్డు పరిధిలోని ఇంద్రానగర్‌లో సొంత డబ్బులతో కౌన్సిలర్ పరిమి లత బోరు వేయించి ఉదారత చాటారు. కాలనీలో నీటి ఎద్దడి నెలకొనడంతో కౌన్సిలర్ సొంతంగా రూ.60 వేల వరకు ఖర్చు చేసి బోరు వేయించడంతోపాటు మోటా రు బిగించారు. తాగునీటి సమస్య తీర్చినందుకు కాలనీవాసులు కౌన్సిలర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు సురేశ్, పలువురు కాలనీవాసులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేటి నుంచి శిక్షణ

లక్ష్మణచాంద: మండలంలోని ప్రజాప్రతినిధులకు స్వచ్ఛభారత్ మిషన్ అమలు, పేదరిక నిర్మూలన సంస్థ కార్యక్రమాలు, సఖీ సేవలపై నేటి నుంచి మూడు రోజుల శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో మోహన్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం నుంచి బుధవారం వరకు మండలకేంద్రంలోని రైతువేదికలో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు శిక్షణ నిర్వహిస్తామన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ, కోఆప్షన్ సభ్యులు హాజరు కావాలని కోరారు.

గజ్జలమ్మ దేవికి పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

కుంటాల: కుంటాల ఇలవేల్పు శ్రీ గజ్జలమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మి ఆలయాల్లో ఆదివారం భక్తులు పూజలు నిర్వహించారు. తులాభారం వేసి తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మహారాష్ట్రలోని నాందేడ్, బోకర్, ధర్మాబాద్, శివుని, ఇస్లాపూర్, అప్పారావుపేట్, మలక్‌జాం తదితర ప్రాంతాల భక్తులు వచ్చి నైవేద్యాలు సమర్పించి పూజలు నిర్వహించారు. గురు స్వామి జక్కని గజేందర్, అర్చకుడు నగేశ్ ఆధ్వర్యంలో గజ్జలమ్మ దేవికి అభిషేకం, అలంకరణతోపాటు పల్లకిసేవ నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదం పంపిణీ చేశారు.

'బలగం' ప్రదర్శన

లక్ష్మణచాంద: మండలంలోని పొట్టపెల్లి(కే) గ్రామంలో ఆదివారం బలగం సినిమా ప్రదర్శన ఏర్పాటు చేయగా గ్రామస్తులు తరలివచ్చారు. పోతుగంటి కళావతి–భూమన్నల జ్ఞాపకార్థం వారి కుటుంబసభ్యులు సంగీత–మల్లేష్, రాధిక–సాయన్న, సరిత–అశోక్ ఆధ్వర్యంలో గ్రామంలోని హనుమాన్ ఆలయ ఆవరణలో సినిమా ప్రదర్శించారు. పలువురు సినిమా చూసి తమవారిని గుర్తు చేసుకున్నారు.

కుంటాల: మండలంలోని అంబకంటి గ్రామంలో అంపోలి సాయినాథ్, అందాకూర్ గ్రామంలో మాలేగాం కిషన్‌రావు స్మారకార్థం ఆదివారం రాత్రి బలగం సినిమా ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు తరలివచ్చి సినిమా వీక్షించారు.

భైంసాలో జబర్దస్త్ టీం సందడి



కార్యక్రమంలో పాల్గొన్న కమెడియన్లు

భైంసాటౌన్: పట్టణంలో ఆదివారం సాయంత్రం జబర్దస్త్ టీం సభ్యులు సందడి చేశారు. ఓ బేకరీ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన కమెడియన్లు వెంకి మంకీ, సత్తిపండు, ఫైమా, వినోదినితోపాటు పలువురు స్కిట్లు చేసి నవ్వించారు. దీంతో వీరిని చూసేందుకు పట్టణవాసులు తరలివచ్చారు.

కొనసాగుతున్న సప్తాహం

తానూరు: మండలంలోని బెంబర గ్రామంలో కొనసాగుతున్న అఖండ హరినామ సప్తాహం ఆదివారం నాలుగో రోజుకు చేరింది. ఉదయం జ్ఞానేశ్వర పారాయణం, మధ్యాహ్నం గతభజన, రాత్రి కీర్తన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాకు చెందిన గంగాధర్ మహరాజ్ పాల్గొని భక్తులకు పలు సూచనలు అందించారు. తల్లిదండ్రులకు సేవ చేయాలన్నారు. కార్యక్రమంలో సప్తాహం కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

'ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తున్న ప్రభుత్వం'

ఖానాపూర్: సీఎం కేసీఆర్ నియంతలా వ్యవహరిస్తూ ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తుందని వైఎస్సార్ తెలంగాణ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు బాణావత్ సిద్దార్థనాయక్ అన్నారు. ఆదివారం విలేకరులతో మాట్లాడారు. పార్టీ రాష్ట్ర అధినేత షర్మిల పిలుపు మేరకు టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ వ్యవహారంతో నిరుద్యోగులకు జరుగుతున్న అన్యాయంపై తమ పార్టీ శ్రేణులు చేపట్టే ఆందోళనలు అడ్డుకొని అరెస్టులు చేయించడం హేయమైన చర్య అన్నారు. అరెస్టు చేసిన నాయకులను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

భగీరథ పైపులైన్‌కు లీకేజీ



వృథాగా పోతున్న నీరు

ఖానాపూర్: పట్టణంలోని పాతబస్టాండ్ సమీపంలో ప్రధాన రహదారి పక్కన ఆదివారం భగీరథ పైప్‌లైన్‌కు లీకేజీ ఏర్పడటంతో నీరంతా వరదలా పారింది. విద్యుత్ స్తంభం ఆనుకొని పైపులైన్ ఉండటంతో స్థానికులు ఆందోళన చెందారు. సమారు గంటపాటు నీరంతా వృథాగా పోవడంతో మున్సిపల్ చైర్మన్ రాజేందర్, కమిషనర్ రత్నాకర్‌రావు అక్కడకు చేరుకొని నీటి సరఫరాను నిలిపివేయించారు.